

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**1935 నాటికి** ఈ నాటకోద్యమం చల్లారింది. నా తరం నాటికి విశాఖ నాటక కళామండలి మాత్రం నడుస్తోంది. విశ్వనాథ కళాసమితి అప్పుడప్పుడు నాటకాలను ప్రదర్శిస్తోంది. దాని గురించి ముందు ప్రస్తావిస్తాను. ఏమైనా కేవలం ఉత్సాహం పెట్టుబడిగా విరివిగా ప్రదర్శనలిచ్చిన సంస్థ నా రాఘవ కళానికేతన్. రకరకాల నాటికలు ప్రదర్శనకి సిద్ధంగా ఉండేవి. వాపస్ (డి.వి.నరసరాజు), ఆడది (పినిశెట్టి), రిహార్సల్స్ (సోమంచి యజ్ఞన్న శాస్త్రి), కుక్కపిల్ల దొరికింది, స్వయంవరం (రావికొండలరావు) – యివి కాక రాత్రికి రాత్రి నేను రాసే రచనలు. ఆ రచనలు ఇప్పుడు నా దగ్గరలేవు. ఆ అనుభవాన్ని, ఆ కృషిని దాటి నిలిచిన మొదటి రచన 'అనంతం.'

నా సంస్థలో నటులు తర్వాత ప్రొఫెసరయి, చాలా రచనలు చేసిన బి.జి.వి నరసింహారావు, శివాలయం ప్రధాన అర్చకుని కొడుకు జగన్నాథరావు, సుందరం – మాకంటే ఎన్నో సంవత్సరాలు పెద్ద. ముడియల సూర్యనారాయణగారు. ఆయన ఆజానుబాహువు. ఎత్తు ఆరడుగుల పైన. ఆ రోజుల్లో విశాఖలో ఒకే ఒక మెయిన్ రోడ్డు. ఆయన గుడిసెన గుళ్ళ దగ్గర రోడ్డుమీద నిలబడితే గుప్తా బ్రదర్స్ దగ్గర కనిపించేవారు. ఆయన బి.ఏ ప్రసాద్ (అవును, తర్వాత సినీ దర్శకుడయాడు) ప్రభృతులు నిర్వహించే విశ్వనాథ కళాసమితి సభ్యులు. ఆ సమితి ఎప్పుడో నాటకాలు వేసేవారు. నేను ఎప్పుడూ వేసేవాడిని. కనక ఆ ట్రూపులోనే ఎక్కువ నటించారు.

నా సమాజానికి నేనే ఒన్ మాన్ ఆర్మి. నేనే నాటిక రాసి, రిహార్సల్స్ చేసి, టౌన్ హాల్ బుక్ చేసి, టిక్కెట్లు ప్రింటు చేసి, వాటిని అమ్మి, ప్రదర్శన నాడు తెరలు కట్టి, అందరికీ మేకప్ చేసి అప్పుడు నటించేవాడిని. నేనే ముఖ్య అతిథిని ఆహ్వానించేవాడిని. సాధారణంగా అప్పటి పూర్ణా టాకీస్ అధినేత గ్రంథి మంగరాజుగారు మాకు ముఖ్య అతిథి. పిలిచిందే తడవుగా వచ్చేవారు. ఉదారంగా విరాళం యిచ్చేవారు. ఒకసారి మిత్రులు, మాకు సీనియర్ రచయిత అంగర వెంకట కృష్ణారావుగారు ఉపన్యాసకులు. స్వాగతోపన్యాసం కూడా నేనే. ప్రదర్శన ముగిశాక తెరలు దించడం, వాపసు యివ్వడం – అంతా నా పనే.

***ఏ వృత్తిలోనయినా అన్ని పనులు చేయగలిగిన స్తోమతా, దక్షతా ఉన్న వ్యక్తికి ఓ బలం కలుగుతుంది. పక్కవాడికి అతని పట్ల గౌరవమూ ఏర్పడుతుంది***. ఏ పాత్రకి ఏ నటుడు రాకపోయినా ఆ మేరకి ఆ పాత్రనో, ఆ నటుడినో భర్తీ చెయ్యడం ఆనాటి అలవాటు. ***వస్తువుని తయారు చేయడం కన్నా మరమ్మత్తు చేయడం తెలిసిన వాడికున్న ఒడుపు గొప్పది.*** అన్ని విభాగాల్లోనూ సమగ్రమైన ఈ కృషి ముందు ముందు నా జీవితమంతా వినియోగపడింది .అంతేకాదు. ***ఏ పని మీద అధికారం సమగ్రంగా నిలుపుకోవాలన్నా కింది నుంచి పైదాకా స్వయంగా చేసుకోగలిగే శక్తి ఉండాలన్న మూలసూత్రం ఆనాడే వంటబట్టింది.*** నా ఉద్యోగంలో, నా వృత్తిలో ఎవరూ, ఏనాడూ తమ ప్రావీణ్యం కారణంగా నన్ను బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఇవ్వలేదు.

ప్రచురితమయిన నా మొదటి రచన 'అనంతం ', ఆనాటి మొదటికాపీ కేవలం 45 సంవత్సరాలనాటిది యిప్పటికీ నా దగ్గర ఉంది. స్త్రీ మొదటిసారి తల్లి అయినప్పటి ఆనందంలాంటిది. ఆనాడు నా మొదటి ప్రచురణ నా చేతికి రావడం. నవోదయా పబ్లిషర్స్ దాన్ని ప్రచురించారు. ఆ సంస్థ మేనేజరు పి.యస్.ప్రకాశరావుగారు. అప్పుడు ప్రారంభమయిన మా స్నేహం జీవితమంతా ఎన్నో రంగాల్లో కొనసాగింది.

అప్పట్లో 'అనంతం' నాటికని ప్రదర్శించని సంస్థ లేదు. ఇప్పటికీ పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారు గర్వంగా ఆ నాటికలో డైలాగుల్ని సభల్లో చెప్తారు. 'అనంతం ' నాటికని ప్రదర్శించి బహుమతులు పుచ్చుకున్న సంగతి కేంద్రమంత్రి అయాక ఓ సభలో మిత్రులు దాసరి నారాయణరావు గారు ఆనందంగా గుర్తుచేస్తుకున్నారు. నా రచనల్లో అతి విరివిగా ప్రదర్శింపబడిన రచన కూడా అనంతమే. నా జీవితాన్ని కోరుకున మార్గంలో సాగేటట్టు చెయ్యడానికి అది సంపాదించి పెట్టిన అంతర్విశ్వవిద్యాలయ రచనా పోటీ బహుమతి పెద్దదన్నులాగా నిలిచేది. చదువుమీద శీతకన్ను వేసి, నాటకరంగంలో విజృంభించిన ఓ కుర్రాడు పెడదారిని రహదారిగా, రాజమార్గంగా దిద్దిన ఘనత మా నాటకాల గురువుగారు, ఆనాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిష్ట్రార్ కె.వి గోపాలస్వామిగారిది. తరువాత నా ఉద్యోగాలన్నిటికీ ఆయన పేరే రిఫరెన్స్. నా గురించి ఏం రాసేవారు తెలీదు. కాని ఏ సారీ నాకు ఉద్యోగం రాకుండా పోలేదు. నేను వద్దనుకున్నవే తప్ప, నన్ను వద్దనుకున్న ఉద్యోగాలు తక్కువ.

నా నాటకాల వ్యాసంగానికి మా అమ్మ పూర్తిగా వ్యతిరేకం. కొడుకు జపం విడిచి లొట్టల్లో పడుతున్నాడని బాధ.

కోమల విలాస్‌లో గుండయ్యర్ హోటల్లో మా నాటకాల పోస్టర్లు తగిలించే వాళ్ళం. "ఏమిటీ, మీ అబ్బాయేనా ఈ నాటకాలు ఆడేది?" అని మానాన్నగారిని మిత్రులు పలకరించేవారు. ఆయన బాధాపడేవారా? సిగ్గుపడేవారా? చెప్పడం కష్టం. మా అమ్మలాగా దురుసుగా విమర్శించకపోయినా, తప్పుదోవ పడుతున్నాడేమో అన్న కించ ఏ మూలనో వుండేదనుకుంటాను. కాగా, ఏదో విచిత్రమయిన, తనదైన 'పుంత'ని తొక్కుతున్నాడని ఏ కాస్తో, ఏమూలనో instinctగా

చిన్న తృప్తి కూడా ఉండేదేమోనని నా అనుమానం. దశాబ్దాల తర్వాత నేను సినీనటుడినయాక మా నాన్నగారు గర్వపడినంత. బహిరంగంగా మా అమ్మ గర్వపడలేదు. ఓసారి మా పెద్దబ్బాయి టీవీ ముందు తన మామ్మని అడిగాడు 'నాన్న సినిమాల్లో చేరడం నీకిష్టం లేదా?' అని. అతి నిర్దుష్టంగా లేదని చెప్పింది.

ఇక, ఈ వ్యాసంగం నా చదువుమీద ఎలాంటి ప్రభావాన్ని చూపింది?

బియస్సీ ఆనర్స్‌కి ఓ నాన్‌డిటైల్ సబ్జెక్ట్ ఉండేది. థామస్ హార్డీ నవల "ది మేయర్ ఆఫ్ కాస్టర్ బ్రిడ్జి" ప్రాథ్యగ్రంథం. మొదటి సంవత్సరం మొదటిరోజున, మొదటి అధ్యాయం చెప్పారు ప్రొఫెసర్‌గారు. ఓ రైతు భార్యా కూతురుతో ఓ గ్రామానికి వచ్చాడు. సంత జరుగుతోంది. తాగి ఓ నావికుడితో జూదానికి దిగాడు. జూదంలో భార్య ఎంత వారించినా వినకుండా ఆమెనే పందెం కట్టి ఓడిపోయాడు. తెల్లారేసరికి భార్యనీ, చేతిలో బిడ్డనీ తీసుకుని ఆ నావికుడు మాయమయాడు. ఇదీ కథ. ఇతివృత్తం నాలోని రచయితని ఎంతగా రెచ్చగొట్టిందంటే మళ్ళీ వారం ప్రొఫెసర్‌గారు క్లాసుకి వచ్చేసరికి దాదాపు 500 పై చిలుకు పేజీల గ్రంథాన్ని తెలుగులోకి అనువదించాను. 'పరాజితుడు' అనే పేరుతో దరిమిలాను అది ప్రచురితమయింది. అసలు జోక్ ఏమిటంటే ఆ సంవత్సరం ఆ నవల పరీక్షలోనే నేను ఫెయిలయాను.

ఆ దశలో నా కార్యక్రమాల ఉధృతాన్ని చెప్పడానికి ఒకే ఒక్క కొలమానం ఉంది .మొదటి సంవత్సరం పరీక్షల్లో నా మార్కులు: అనాలిసిస్ః 32, ఆల్‌జీబ్రా: 28, మెకానిక్స్ః 0. అసలు మెకానిక్స్ పేపరులో ప్రశ్నలే నా కర్థం కాలేదు. కేవలం అరగంట హాల్లో కూర్చుని తెల్లకాగితాన్ని అందిస్తుంటే లెక్చరర్ షాక్ అయారు. ఈ మార్కులు చివరలో నా డిగ్రీని నిర్ణయిస్తాయి. అయినా అప్పటి నా అశక్తత అది. విచిత్రంగా ఈ మార్కుల్ని చూసి నాకు చెప్పింది మిత్రుడు మోదుకూరి జాన్సన్.

ఆ పేపర్లో సున్నా వస్తుందని నాకు రూఢిగా తెలుసు. రూఢిగా తెలిసిన వ్యక్తి మరొకరున్నారు. ఆయన మా ప్రొఫెసర్ మీనాక్షి సుందరంగారు. ఆయనకి నా నటన అంటే వల్లమాలిన అభిమానం. ఆయనా గోపాలస్వామిగారూ ఎదురెదురు ఇళ్ళల్లో ఉండేవారు. నా గురించి వారి మధ్య చర్చ ఏమయినా వచ్చేదేమో నాకు తెలియదు. మరుసటి సంవత్సరం పెద్ద పరీక్షలకి ముందు ప్రొఫెసరుగారు నన్ను పిలిచి నన్ను వారింట్లో ఉండి చదువుకోమన్నారు. ఇది ఓ ప్రొఫెసర్ విద్యార్థికి చేసే అరుదైన ఉపకారం. మిగతా డిగ్రీలు ఉన్నా, ఆనర్స్ పరీక్షలకి ప్రొఫెసర్‌గారే మా డిగ్రీ నిర్ణయించే పరీక్షాధికారి. అయితే మర్నాడు పరీక్షలనగా నేను రాత్రి యూనివర్శిటీ గేటు దగ్గరకి టీ తాగడానికి వచ్చి, టాక్సీలో ఊళ్ళోకి వెళ్ళి రాఘవా స్మారక నాటకోత్సవం, విజయనగరం పోటీలకి 'గడ్డిపూలు' నాటిక ప్రీవ్యూ ప్రదర్శన ఇచ్చి. ఏ రాత్రికో యూనివర్శిటీ చేరాను. ఇది మూర్ఖత్వమో, తిరుగుబాటూ కాదు. అప్పటి నా 'మైకం' పరాకాష్టానికి గుర్తు. ప్రేయసి కోసం పాముని పట్టుకుని గోడ దూకిన బిల్వమంగలుడు నాతో పోటీలో నిలువలేదు.

గడ్డిపూలు నాటిక మా సీనియర్. ఇంగ్లీష్ ఎమ్మే చేస్తున్న కొండముది శ్రీ రామచంద్రమూర్తిగారు రాశారు. అందులో ఒక స్త్రీ పాత్ర ఉంది. ఆమెకి ఎంతలేదన్నా ఆరు రూపాయల కిరాయి. రాజేశ్వరి అనే అమ్మాయిని బుక్ చేశాం? డబ్బు ఎక్కడిది? మానాన్నగారు పబ్లిక్ లైబ్రరీకి కట్టిన డిపాజిట్(అయిదు రూపాయలనుకుంటాను) వెనక్కి తీసుకున్నాను. రిహార్సల్స్ టౌన్‌హాల్ రోడ్డులో ఉన్న లైబ్రరీ ఆవరణలో. రాజేశ్వరికి ఓ కొడుకు. రిహార్సల్స్ అయినంతసేపూ ఆ పసివాడిని ఎత్తుకునే పని మా కామయ్య పంతులుది. అసలే ఇస్త్రీ చేసినట్టుండే పవిత్రమయిన బ్రాహ్మణుడు కామయ్య పంతులు. పసివాడితో వాడి గోడు వర్ణనాతీతం.

గడ్డిపూలు ఓ చదువుకున్న మేథావి మనస్సులోంచి వచ్చిన మెలో డ్రామా. దానికింకా జీవితం అనే రంగు అంటలేదు. పాత్రల స్వభావం కాక, కొండముది సంస్కారం ప్రతీ పాత్రలోనూ ద్యోతకమయేది. ఉద్దేశంతో కాక, రచయిత పరిమితులు కారణంగా stylise అయిన రచన. దానికి తోడు మా సామర్ధ్యం అంతంత మాత్రం. ఉత్సాహం ఆకాశం ఎత్తున. అంతకు ముందు సంవత్సరం అంటే 1957 కథ కొంత చెప్పాలి. విశాఖపట్నం మెయిన్‌రోడ్డులో ఉన్న గుడిసెన గుళ్ళలో విశాఖ నాటక కళామండలి అనే నాటక సంస్థ ఉండేది. జేష్ఠ మాసంలో జగన్నాథస్వామి దేవేరీ, తమ్ముడు బలభద్రుడితో అక్కడ కొలువు తీరే పదిరోజులూ విన్నా, సంవత్సరం పొడుగునా అక్కడ నాటకాల వాతావరణమే వెల్లివిరిసేది. విశాఖ నాటక కళామండలి గణపతిరాజు అచ్యుతరామరాజుగారి మానసపుత్రిక. ఆయన స్వతహాగా రచయిత, నటుడూ, ప్రయోక్తా, వృత్తిపరంగా న్యాయవాది. ఆయన మిత్రులూ, మరొక న్యాయవాది రాచకొండ విశ్వనాథశాస్త్రి. ఆ రోజుల్లో అత్యంత రమణీయంగా, వైభవోపేతంగా సాగే పరిషత్తు విజయనగరం రాఘవ స్మారక నాటకోత్సవాలు. వేదుల జగన్నాథరావుగారూ, అప్పుడు దొర, పీసపాటి నరసింహమూర్తిగారూ వీర మా కార్యవర్గ సభ్యులు. వేసవిలో జరిగే ఈ ఉత్సవాలకు ట్రెయినింగ్ కాలేజీలో నాటక సంస్థలకి విడిది యిచ్చేవారు. భోజనాలు పెళ్ళిళ్ళ తంతులో సాగేవి. వంటలూ, పిండివంటలూ – నటీనటుల కోలాహలం – అదొక గొప్ప పండగ. నాకు ప్రత్యేకించి అదొక గొప్ప మలుపు.

ఆ ఉత్సవాలకి విశాఖ నాటక కళామండలి ఒక నాటకం, ఒక నాటిక సిద్ధం చేసింది నాటకాన్ని రావి శాస్త్రిగారు రాశారు. పేరు 'వచ్చేకాలం'. అందులో దుగ్గిరాల సోమేశ్వరరావు, చాగంటి సన్యాసిరాజు ముఖ్యపాత్రలు ధరించారు. అందులోనే మరో రౌడీ పాత్ర మోదుకూరి జాన్సన్ నటించాడు. రావిశాస్త్రిగారికి విశాఖపట్నం యాసమీద పూర్తి అధికారం. జాన్సన్ ఆ పాత్రకి అపూర్వంగా మూర్తికట్టాడు. నాకు తెలిసి బహుశా తన జీవితంలోనూ అనుకుంటాను. జాన్సన్ నటించడం అదే.

బ్రాహ్మణ యాసలో సన్యాసిరాజుగారు చేసిన పాత్ర మరో గొప్ప రూపకల్పన. ప్రతిరోజూ నాటకం రిహార్సల్స్‌కి రావి శాస్త్రిగారొచ్చేవారు. నాటిక పోతుకూచి సాంబశివరావు గారి 'దొంగ'. అందులో ముఖ్య పాత్ర సోమేశ్వరరావుగారిది. ఇక

ఆయన నటనకి తిరుగులేదు. నటనే తన ప్రపంచం అనే అంత కమిటెడ్‌గా కనిపించేవారు సోమేశ్వరరావుగారు. వీరంతా ఆ రోజుల్లో నాకు రోల్ మోడల్స్. ఆ రాత్రులు నా జీవితంలో మరుపురాని మధుర స్మృతులు. అప్పట్లోనే మద్రాసులో స్థిరపడిన మరో విశాఖపట్నం కళాకారులు – ఆకుల అప్పలరాజుగారు వస్తూండేవారు. వారి మద్రాసు అనుభవాలు వినడం స్వర్గంలో రంభ, ఊర్వశి, తిలోత్తమల కథలు వినడంలాగ అనిపించేది.

ఆ సంవత్సరం విజయనగరం పోటీలకి కేవలం విశాఖ నాటక కళామండలి తరపున సహాయకుడిగా రాజుగారిని బ్రతిమాలి, ఒప్పించి బస్సు ఎక్కాను. అప్పట్లో నా ఖర్చు అయిదారు రూపాయలు ఉండవచ్చు. కాని ఆ అనుభవం ఖరీదు యివాళ 50 లక్షలకన్నా యింకా ఎక్కువేనంటాను.

వచ్చేకాలం, దొంగ – రెండూ రెండు మణిపూసలలాగా కనిపించేవి. బి.వి.ప్రసాద్ విశ్వనాథ కళాసమితి తరపున 'సమత' అనే నాటకాన్ని తయారు చేసాడు. ప్రసాద్ చాలా సమర్థుడు. సినిమాల్లో ఛాన్స్‌కి మద్రాసులో ఉంటూ వచ్చి పోతూండేవాడు. (ముందు జీవితంలో ఇద్దరం చాలా గొప్ప సినిమాలు – మనుషుల్లో దేవుడు, ఆరాధన, మేలుకొలుపు వంటివి – రామారావుగారితో కలిసి చేశాం. అది తర్వాతి కథ) ఆయనే ఆ నాటక దర్శకత్వం. రచన – ఆ రోజుల్లో మరో సీనియర్ – తెలుగు శాఖలో రీసెర్చి చేస్తున్న కొర్లపాటి శ్రీరామమూర్తిగారు. సమతకూడా stylised melodrama.

దానికి కొండముది రచనకున్న అన్ని 'కళలూ' ఉన్నాయి. అయితే బి.వి.ప్రసాద్ ఆ నాటకాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. విశాఖ నుంచి బయలుదేరిన ఔత్సాహికుడయిన కుర్రాడికి ఇంతే తెలుసు.

ఆ సంవత్సరం విజయనగరం హస్తబల్ హాలులో ఓ పాల సముద్రాన్ని తిలకించాడు ఆ కుర్రాడు. నాటకరంగంలో ఆ సందోహం, ఆ రుచి, ఆ వైశిష్ట్యం – ఆ కుర్రాడిని దిగ్భ్రాంతుడిని చేశాయి. కాగా ఎంతమంది పెద్దల ఆశీర్వాదంతో ఆనాటి నాటకరంగం పరిపుష్టమవుతోందో అప్పుడు తెలిసివచ్చింది.

అప్పుడే ఆ కుర్రాడి పునాదులు గట్టిపడడం ప్రారంభించాయి. కలల్లో మహాసౌధాలు రూపు దిద్దుకుంటున్నాయి. ఇంతకూ ఏమిటా పాల సముద్రం?

శ్రీకాకుళం నటరాజ కళాసమితి 'పంజరం' (అవసరాల సూర్యారావు) నాటకాన్ని ప్రదర్శించింది. అందులో జె.వి.సోమయాజులు,జె.వి.రమణమూర్తి, జి.నిర్మల(అవును, సినిమా నిర్మలమ్మే), రావి కొండలరావు, గరిమెళ్ళ రామమూర్తి, జె.వి.శ్రీరామమూర్తి – వీరంతా నటులు. 'ఈ ఇల్లు అమ్మబడును' (డి.వి.నరసరాజు) నాటిక. అందులో జె.వి.సోమయాజులు ముఖ్యపాత్ర చేశారు. బాపట్ల నుంచి కొర్రపాటి గంగాధరరావుగారు ఒక నాటకం, నాటిక తెచ్చారు (పేర్లు గుర్తులేదు). ఇంకా కోడూరి అచ్చయ్య చౌదరి, కొడాలి ఆదిశేషయ్య – ఒంగోలు నుంచి పి.ఎల్ నారాయణ,

కాకినాడ నుంచి ఏడిద నాగేశ్వరరావు, హరినాధరాజు అనిశెట్టిగారి 'చెప్పుకింద పూలు' తెచ్చారు. ఇక విజయవాడనుంచి ర.స.న. సమాఖ్య బెల్లంకొండ రామదాసుగారి 'ఆకాశ రామన్న' ప్రదర్శించింది. అందులో కె. వెంకటేశ్వరరావు, జి.యస్.ఆర్ మూర్తి. పొట్టిప్రసాద్. రామచంద్రరావు. జి.వి సుబ్బారావు. ఓహో! అది ఏమి వైభవం! నిజానికి నేను చూసిన 'వచ్చేకాలం ', 'సమత ' వీటి ముందు ఎక్కడా కనిపించలేదు. బందరు నుంచి పింగళి నాగేంద్రరావుగారి 'ఒకే కుటుంబం' తీసుకొచ్చారు. ఆ ఉత్సవాన్ని ఏమీ చేతకాని నేలబారు మనిషి చూసినా నటుడో, రచయితో అదీ ఇదీ కాకపోతే గొప్ప నాటకాభిమానో అయి తీరాలి. ఔత్సాహిక నాటకరంగం అత్యంత వైభవంగా వెలిగిపోతున్న రోజులవి. గరికిపాటి రాజారావుగారు వచ్చారు. కాని నాటకంతో రాలేదు. ఆ తర్వాత 40 – 50 సంవత్సరాలపాటు తెలుగు నాటక రంగంలో యివే పెద్ద పేర్లు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments